# గోడ

మల్లిగాడు మల్లయ్యగానూ, పున్నిగాడు పున్నయ్యగానూ, 'ఫలానా' గాడు 'ఫలానా అయ్య'గానూ పిలువబడే ఆ తరుణం కాస్తా రానేవచ్చింది. ఒరే నంజి కొడకా అందే 'చిత్తం బాబూ!' అని పలికే వాళ్ళిప్పుడు 'ఓటరు మహాశయు' లయ్యారు.

అలాంటి మహర్దశ మన కథానాయకుడు సాంబయ్యకి కూడా పట్టింది. వాడికిప్పుడు సాక్షాత్తు వీర్రాజు బాబుగారి నుంచి కబురొచ్చింది. పది లక్షల ఆస్తి, వందెకరాల సేరీ, పుట్టెడు రాజకీయాలూ వీర్రాజుగారి సొత్తు. పై చూపేకాని క్రింది చూపు వారి కలవాటులేదు.

మరలాంటి వారు రమ్మని కబురు పెట్టారంటే మాటలు కాదు. సాంబయ్య ఆశ్చర్యపోయాడు. గబగబ వెళ్ళి వీర్రాజుగారికి దండంపెట్టి వినమ్రంగా నిల్చున్నాడు.

ఈజీ ఛైర్‌లో మరింత యీజీగా కూర్చుంటూ- చుట్ట ముట్టించుకుంటూ ''రావోయ్ నీకోసమే చూస్తున్నా - నీతో కొంచెం పని పడిందయ్యా, దా, అలా కూర్చో'' అన్నారు వీర్రాజుగారు బెంచీ బల్ల చూపిస్తూ.

సాంబయ్య గుండె ఝల్లుమంది.

తను వారి యెదుట బల్లమీద కూర్చోవడమా! వారి ముఖంలోకి తిన్నగా చూడ్డానికే తనలాంటి వాడికి ధైర్యం చాలిచస్తేకదా?

''వద్దండి బాబయ్యా - నాను కూకోడవేటి? ఏటి సెలవు సెప్పండి. యినుకుంతాను'' అన్నాడు భయభక్తులతో.

''ఫరవాలేదోయ్ కూచో'' అని బల్లమీద కూర్చోపెట్టించి, చల్లని మజ్జిగ యిప్పించారాయన.

సాంబయ్య కిదంతా అయోమయంగా ఉంది. తనేటి? పెదబాబుగారి ఎదుట బల్లమీద కూర్చోడమేమిటి? ఈ మజ్జిగ తాగడమేమిటి? తనతో అయ్యగారికి పని పడటమేమిటి? వాడి ఊహకి అందలేదు.

''ఎలక్షన్లొస్తున్నాయోయ్- విన్నావా?''

బెదిరిన గొడ్డులా వున్న సాంబయ్యకి వారేం శలవిచ్చారో వెంటనే తలకెక్కలేదు. తరవాత జల్దుగుని ''సిత్తం బాబూ ఓట్లు... ముద్దర్లెలస్సన్లు... ఆటి వూసేనండీ? ఇన్నానండి' అన్నాడు.

కామినాయుడికిపోటీగా నేను నిలబడుతున్నానోయ్'' అన్నారు వీర్రాజుగారు.

''సిత్తం... నా ఓటు మీకేనండి- మా యింటిదానిదీనండీ'' అలవాటు ప్రకారం అమాయకంగా అన్నాడు సాంబయ్య.

గుబురు మీసాలు నిక్కబొడుచుకునేలా పెద్దపెట్టున నవ్వేశారు వీర్రాజుగారు.

''ఓటుమాటకాదోయ్ సాంబయ్యా... దాని గురించి నిన్ను వేరేనేనడగాలా? నువ్వు మా వాడివేనని మేం మా లెఖ్ఖల్లో ఎప్పుడో వేసేసుకున్నాం'' అన్నారు నవ్వాపుకుని.

తన సంగతి వారికి అంతకు ముందునుండే గుర్తుండి తనని వారి 'వాడి'గానే వారెప్పుడో లెక్కలో వేసుకోవడం ఈ విషయాలు విన్నాక సాంబయ్య మనసు పులకరించిపోయింది. 'దొడ్డ' ప్రభువు అనుకున్నాడు మనసులో.

''ని యింటి తూర్పు వేపున్న గోడ వుంది చూశావూ? మట్టిగోడ కదూ అది? వెనక పూటీలు పెట్టించి, ఆ మట్టిగోడని తిరగదోయించేసి సిమెంటుగోడ కట్టించి యిస్తానోయ్. చెప్పొద్దూ నాకు దాపరికం లేదు అందులో నా స్వార్థం కూడా కొంచెం వుందనుకో! అక్కడ సిమెంటుగోడ కట్టించి దానిమీద మా పార్టీబొమ్మ రంగుల్తో వేయించి ప్రకటన రాయిస్తే దాన్సిగదరగ అదిరిపోదూ! ఖర్చుతో పనే అనుకో. కాని యిటు మా పనీ అవుతుంది అటు పేదవాడివి నీకూ కొంప బాగుపడుతుంది. తర్వాత తాపీగా మనం ఎలక్షన్లలో గెలిచేక మొత్తం పాకతీయించేసి పెంకుటిల్లు కట్టించేద్దాం. ఏమంటావు?'' అనడిగేరు.

సాంబయ్య కిదంతా వింతగా ఉంది. ఏం మాట్లాడాలో తోచలేదు. అయ్యగారు తనమీద అంతదయ చూపిస్తూవుంటే ఏమనాలో కూడా అర్థంకాలేదు.

''తంవరి దయ'' అనిమాత్రం అనగలిగేడు.

* * *

ఆ గ్రామానికి నడిబొడ్డున, అన్ని రకాల రాజకీయాలకి, వ్యాపారాలకి అతి కీలకమయిన స్థలంలో, పచ్చని పైరుమధ్య దిష్టిబొమ్మలా ఉంది సాంబయ్య యిల్లు. మట్టిగోడల పూరిల్లు. పురాతనమైనది కావటం చేతా, ఊరు విస్తరించడం చేతా ఆ యిల్లు సరిగ్గా అతి ముఖ్యమయిన స్థలంలో మిగిలిపోయింది. ఆ యిల్లు కొనుక్కుని ఆ స్థలంలో మేడ కట్టుకోవాలని ఒకరిద్దరు చూశారు కాని సాంబయ్య అమ్మకానికి ఒప్పుకోలేదు.

సాంబయ్య యింటికి తూర్పునున్న మట్టిగోడ వీర్రాజుగారి ప్రత్యర్థి కామినాయుడు యింటికీ, వారి ఎలక్షన్ ఆఫీసుకి సరిగ్గా ఎదురుగా ఉంది! జనం రద్దీ బాగా వుండే చోటు కూడా కనుక ఆ గోడకంత ప్రాముఖ్యత కలిగింది. వాల్‌పోస్టరేదయినా సరే దానిమీద అంటించకుండా వదలరు.

ఆ గోడమీద తన పార్టీ గుర్తుతో ప్రకటన ఆయిలు పెయింటుతో గనక ఆర్టిస్టు చేత వ్రాయిస్తే బ్రహ్మాండమయిన పబ్లిసిటీ జరుగుతుందన్న ఆలోచన వచ్చింది వీర్రాజుగారికి. అందుకే పడిపోతూ, చవుడు రాలిపోతూన్న ఆ గోడని పునర్ధరించడానికి సైతం నిశ్చయించుకున్నారాయన. అటు తమకీ లాభదాయకం, సాంబయ్యలాంటి వారి అభిమానమూ చూరగొనవచ్చునని వారి ఆలోచన...

పని ప్రారంభమయింది. సాంబయ్య పూరింటికి కర్రలతో పూటీలు పెట్టించి, ఆ పాతకాలపు

మట్టిగోడను తప్పించి, దాని స్థానంలో సిమెంటుగోడ కట్టించేరు వీర్రాజుగారు. సాంబయ్యకి మహదానందంగా ఉంది. ''అయ్యగోరు ధర్మపెబువులు, పేదోళ్ళంటే సెడ్డ కనికరం'' అన్నాడు అందరిదగ్గరా.

రెండురోజుల్లో గోడ తయారయింది. రంగులతో వీర్రాజుగారి పార్టీగుర్తుతో వూరంతటికీ కొట్టొచ్చేలా కనబడే పెద్ద ప్రకటన వ్రాయబడింది.

సాంబయ్య ఆ గోడనీ, దానిమీద రంగుల బొమ్మనీ, అందమైన అక్షరాలనీ చూసి తెగ మురిసిపోయాడు.

* * *

ఎన్నికలు ముగిశాయి. వీర్రాజు గారు గొప్ప మెజారిటీతో గెలిచారు.

రోజులు గడిచాయి... సాంబయ్య తన యింటి గురించి బాబుగారితో మాట్లాలని చాలా ప్రయత్నం చేశాడు. కాని వీర్రాజు గారికి మీటింగులతోనూ, సన్మానాలతోనూ, ప్రయాణాలతోనూ... సాంబయ్యతో మాట్లాడటానికి ఎక్కడా వీలు చిక్కలేదు...

నెలలు గడిచాయి. తుఫాను గాలులూ, వర్షాలూ వచ్చేయి. పూటీగా వుంచిన కర్రలు విరిగి, సాంబయ్య పూరిల్లు ఫెళఫెళా కూలిపోయింది. సాంబయ్య గొల్లుమని ఏడుస్తూ వెళ్ళి, పెళ్ళాం పిల్లల్తో ఎక్కడో తలదాచుకున్నాడు...

తనగోడు వీర్రాజుగారితో చెప్పుకున్నాడు ''చూద్దాంలే'' అని తలాడించారాయన. ఆ తరువాత బహుశా వారాసంగతి మరిచిపో[illegible]ారు. యింటికప్పు తిరిగివేయించుకునే తాహతు సాంబయ్యకి లేదు. చూస్తుండగానే సాంబయ్య ఇ[illegible]లమైపోయి, నేలమట్టమైపోయింది...

వీర్రాజుగారు దయతో కట్టించిన గోడమాత్రం నిర్దయగా నిలచిన పెనుభూతంలా ఉంది. ఆ గోడమీద ప్రస్తుతం సినీమాతారల అర్ధనగ్న దృశ్యాల వాల్‌పోష్టర్లూ వాటిమీద దురభిమాన సంఘాలవారి ప్రతాపానికి ఫలితంగా పేడముద్దలూ రాజ్యంచేస్తున్నాయి.

(ప్రజాతంత్రవీక్లీ. 10.4.77)